క్లుప్తంగా

గౌతులచ్చన్న విగ్రహావిష్కరణ



పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శనివారం సర్దార్ గౌతులచ్చన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ గౌతులచ్చన్న స్వాతంత్ర్య సమరయోధుడిగా, రైతు నాయకుడిగా, కార్మికనేతగా, వెనుకబడిన తరగతుల సంక్షేమ నాయకుడిగా ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన ఆశయ సాధనకు యువత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గౌతు శిరీష, బోడె ప్రసాద్, టీడీపీ నేతలు వీరంకి గురుమూర్తి, కొనకళ్ల బుల్లయ్య, అనుమోలు ప్రభాకరరావు, కోయా ఆనంద్‌ప్రసాద్, వెలగపూడి శంకర్‌బాబు, పలువురు నేతలు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

కంకిపాడు: ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ పీ అనూష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కంకిపాడు మండలం వ్యాప్తంగా 13 బ్యాంకుల పరిధిలో 30 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. రూ. 1.19 కోట్ల రుణాలు సబ్సిడీపై అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. దరఖాస్తులను https:// apobmms. apcfss.in// ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు.

చోడవరంలో వ్యవసాయ భూముల సర్వే



పెనమలూరు: చోడవరం గ్రామంలో వ్యవసాయ భూముల సర్వే చేపడతామని తహసీల్దార్ గోపాలకృష్ణ తెలిపారు. చోడవరంలో ఏపీ రీసర్వే ప్రాజెక్టులో భాగంగా శనివారం ఆయన వ్యవసాయ భూముల సర్వేపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామంలో 467 సర్వే నెంబర్లు ఉన్నాయన్నారు. వీటిలో 4,078.26 ఎకరాల భూమి ఉందని తెలిపారు. ప్రభుత్వ భూమి 1,788.35, ప్రైవేటు భూమి 2,288.91 ఎకరాలు ఉందన్నారు. మొత్తం 1,206 మంది రైతులు ఉన్నారని చెప్పారు. ఈ నెల 21 నుంచి మే నెల 21వ తేదీ నాటికి సర్వే పూర్తి చేస్తామని తెలిపారు. గ్రామంలో భూయజమానులు, రైతులు సర్వే సమయంలో రెవిన్యూ అధికారులకు సహకరించాలని కోరారు. పెదపులిపాక గ్రామంలో చేపట్టిన వ్యవసాయ భూముల సర్వే పూర్తి చేశామని అన్నారు. సర్పంచి కాకర్ల వెంకటరత్నం, డివిజినల్ సర్వేయర్ శివరామప్రసాద్, రీసర్వే డీటీ అరుణ్, ఆర్ఐ భరద్వాజ్, సర్వేయర్ శివరామకృష్ణ, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కళాకారులు సాంస్కృతిక వారధులు



విజయవాడకల్చరల్: కళాకారులు సాంస్కృతిక వారధులని విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్ రాజు అన్నారు. ప్రణవి మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఈస్టర్ పండుగ సందర్భంగా శనివారం సినీ సంగీత విభావరి, కళాకారులకు ఆత్మీయ సత్కారం చేశారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ప్రణవి మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు నూతన గాయనీ గాయకులకు వేదిక కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన బీవీ వీరభద్రరావు, ప్రసూనా రామన్, దూపాటి శ్రీదేవి, ప్రభల శ్రీనివాస్, శివశర్మ పాల్గొన్నారు. భారతి, సుహాసిని, మల్లీశ్వరి, సుశీల్‌కుమార్ ఈస్టర్ గీతాలు, క్లాసికల్ చిత్రగీతాలను ఆలపించారు. మహానటి సావిత్రి సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరుచూరి విజయలక్ష్మికి లెజండరీ కల్చరల్ బిరుదుతో సత్కరించారు.

పెసర రైతుకు కొనుగోడు కేంద్రాలు

- నెల రోజులుగా సాగుతున్న పెసర కొనుగోళ్లు
- ఇప్పటి వరకూ ఒక్క పైసా అందక రైతుల అవస్థలు
- నగదు కోసం అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్‌కు గోడు వినిపించిన రైతు
- అయినా రైతుల ఆవేదనను పట్టించుకోని ప్రభుత్వం



కంకిపాడు మార్కెట్ యార్డులో పెసర జల్లెడ పడుతున్న కూలీలు

కంకిపాడు: పెసర కొనుగోళ్లు ప్రారంభమై నెల కావస్తోంది. నేటికీ ఏ ఒక్క రైతు ఖాతాలోనూ ఒక్క పైసా కూడా జమ కాలేదు. రోజుల తరబడి సొమ్ము కోసం రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు. స్వయంగా పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఓ రైతు పెసర సొమ్ము ఎప్పుడిస్తారంటూ ప్రశ్నిస్తే ప్రతిపాదనలు వెళ్లాయంటూ ఆయన మొక్కుబడిగా సమాధానం ఇచ్చి వెళ్లిపోయారు. దీనిని బట్టి రైతులపై కూటమి సర్కారుకు ఎంత శ్రద్ధ ఉందో అర్థం చేసుకోవచ్చు. పేరుకేమో రైతు పక్షపాత ప్రభుత్వమని ప్రచారం చేసుకుంటున్న కూటమి సర్కారు రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిందంటూ రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో కృష్ణా జిల్లా వ్యాప్తంగా 2,84,237 ఎకరాల్లో మినుము, మూడు వేల హెక్టార్లలో పెసర సాగైంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించటంతో పంట దిగుబడులు ఆశాజనకంగా వచ్చాయి. ఎకరాకు ఏడెనిమిది క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. ఎకరాకు పంట చేతికొచ్చేనాటికి రూ.30 వేల వరకూ పెట్టుబడులు పెట్టారు.

బయట మార్కెట్ డీలా

గత ఏడాది రబీ సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది రబీ సీజన్‌లో బయటి మార్కెట్‌లు డీలా పడ్డాయి. మినుము మద్దతు ధర క్వింటా రూ.7400 ఉంటే



పెసర డబ్బులు అందలేదంటూ మంత్రి మనోహర్‌ను ప్రశ్నిస్తున్న రైతు (ఫైల్)

బయట మార్కెట్‌లో రూ.7200 మాత్రమే. గత ఏడాది రూ.9100 వరకూ ధర పలికింది. పెసర క్వింటా మద్దతు ధర రూ.8682. రూ.7400లకు మించి ధర దక్కటం లేదు. అపరాల రైతులు పడుతున్న మద్దతు కష్టాలపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. డిమాండ్‌కు అనుగుణంగా గత నెల 19న జిల్లాలో ఎనిమిది కొనుగోలు కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ధర వ్యత్యాసం తక్కువగా ఉండటంతో మినుము రైతులు స్థానికంగానే దళారులకు పంట విక్రయిస్తున్నారు. మరి కొందరు మంచి ధర కోసం నిల్వ చేసుకుంటున్నారు. పెసర రైతులు మాత్రం క్వింటాకు రూ.1200 వరకూ తేడా ఉండటంతో కొనుగోలు కేంద్రాలకు తరలించి పంటను విక్రయిస్తున్నారు.

రవాణా, కూలి ఖర్చుల భారం

రవాణా, కూలి ఖర్చులు రైతులకు తలకు మించిన భారంగా మారాయి. కొనుగోలు కేంద్రం వద్దకు పెసరను ప్రైవేటు వాహనాల్లో తరలించటం, జల్లెడ పట్టించటం, కాటా వేయటానికి అయ్యే ఖర్చులు కూడా రైతులే భరించాల్సి ఉంది. పెట్టుబడులతో పాటు రవాణా, కూలి ఖర్చులు రూ.2 వేలు అదనంగా పెట్టుబడి పెట్టాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

జిల్లా వ్యాప్తంగా 683 టన్నుల పెసర కొనుగోలు చేశాం. రైతులకు అందాల్సిన సొమ్ముపై ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపించాం. నాలుగు రోజుల్లో సొమ్ము విడుదలవుతుందని సమాచారం. విడుదల కాగానే రైతులకు ఖాతాలకు జమ చేస్తాం. రైతులు ఆందోళన చెందొద్దు.

– మురళీకిషోర్, డీఎం, మార్క్‌ఫెడ్, కృష్ణాజిల్లా

రైతులపై కూటమి నిర్లక్ష్యం

కూటమి ప్రభుత్వం రైతులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి. సీజన్ ముగియగానే మార్కెట్ ఒడిదొడుకుల కారణంగా రైతులు తీవ్ర అగచాట్లు పడ్డారు. పంటకు మార్కెట్‌లో ధర పలకక, కొనుగోలు కేంద్రాలు తెరవక, దళారులకు తెగనమ్ముకుని నష్టపోయారు. ఆర్థికంగా నష్టాన్ని చవిచూశారు. మార్కెట్ పరిస్థితులపై ముందుగానే క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా నివేదిక తెప్పించుకుని తదనుగుణంగా రైతులు నష్టపోకుండా తీసుకోవాల్సిన చర్యల్లో కూటమి విఫలమైందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

రైతులకు అందని సొమ్ము

జిల్లా వ్యాప్తంగా ఆరుగొలను, పెరికీడు, ఆత్కూరు, కంకిపాడు, కేసరపల్లి, బొడ్డపాడు, గుడివాడ, మొవ్వ ప్రాంతాల్లో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో పెసలు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాల ద్వారా ఇప్పటి వరకూ 344 మంది రైతుల నుంచి 683.75 టన్నుల పెసర కొనుగోలు చేసి గోదాములకు తరలించారు. ఇందుకు రైతులకు రూ.3.77 కోట్లు అందాల్సి ఉంది. కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరణ ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా నేటికీ ఒక్క రూపాయి కూడా రైతులకు అందలేదు. ప్రభుత్వం చెప్పే మాటలకు, చేతలకు పొంతన లేకుండా పోతోందని, తమను నిర్లక్ష్యం చేయడం అలవాటుగా మారిందని రైతులు వాపోతున్నారు. పెసర సొమ్ము అందక ఇబ్బంది పడుతున్నామంటూ కోలవెన్నుకు చెందిన ఓ రైతు ఇటీవల పునాదిపాడులో మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ప్రశ్నిస్తే ప్రతిపాదనలు పంపాము రాగానే వస్తాయంటూ వెళ్లిపోవడం గమనార్హం.

హనుమజ్జయంతి ఉత్సవాల ఏర్పాట్లకు శ్రీకారం



హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో ఏటా నిర్వహించే హనుమజ్జయంతి ఉత్సవాల ఏర్పాట్లకు శనివారం శ్రీకారం చుట్టారు. దేవస్థానం ప్రాంగణంలో ఉత్సవ ఏర్పాట్ల పనులను రాటా ఉత్సవంతో ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు, అర్చకులు శృంగారం రామానుజాచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఉత్సవ పందిరి ఏర్పాటుకు రాటా కర్రను ప్రతిష్టించారు. హనుమజ్జయంతి ఉత్సవాలను వచ్చేనెల 17 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి పీ తారకేశ్వరరావు తెలిపారు. ఆలయ కమిటీ మాజీ చైర్మన్ కొండేటి కనకదుర్గారావు, పుర ప్రముఖులు వేమూరి శ్రీనివాసరావు, వీరమాచినేని సత్యప్రసాద్, సుంకర సుభాష్‌చంద్రబోస్, మేడేపూడి రామ్మోహనరావు, తాడి రంగారావు, వేగిరెడ్డి పాపారావు, వడ్డి వాసవి, మట్టా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

22న మాజీ సైనికులకు అవగాహన సదస్సు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మద్రాసు రెజిమెంట్‌కు చెందిన మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువులకు నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ అధికారి కార్యాలయంలో ఈ నెల 22న అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు జిల్లా సైనిక వెల్ఫేర్ ఆఫీసర్ కళ్యాణ వీణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాజీ సైనికులు, మాజీ సైనికుల వితంతువుల సమస్యలు తెలుసుకొనేందుకు సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిశ్చార్జ్ బుక్, పెన్షన్ పేమెంట్ ఆర్డర్, ఐ కార్డ్, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.

స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలి

గన్నవరం: స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పౌరసరఫరాల సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మంజీర్ జిలానీ సమూన్ కోరారు. మండలంలోని దావాజిగూడెంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ–వేస్ట్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా సమూన్ మాట్లాడుతూ.. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఒక ప్రత్యేకాధికారిని నియమించిందని తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్యవంతమైన జీవనం కోసం పరిసరాల పరిశుభ్రతను పాటించాలని సూచించారు. కృష్ణా కలెక్టర్ డి.కె.బాలాజీ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎలక్ట్రానిక్ వస్తువుల వ్యర్థాలు విపరీతంగా పెరిగాని, వాటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్వీర్యం చేయకపోతే పర్యావరణానికి, మానవాళికి హాని జరుగుతుందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణ కోసం ప్రతి పంచాయతీలో కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇళ్లలోని ఈ– వ్యర్థాలను ప్రజలు ఈ సెంటర్లలో అప్పగించాలని సూచించారు. బుద్ధవరం పంచాయతీ శాశ్వత భవన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్ నుంచి రామవరప్పాడు వరకు జాతీయ రహదారి సుందరీకరణకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సర్పంచి బడుగు బాలమ్మ, డీపీఓ జె.అరుణ, వైస్ ఎంపీపీ కొమ్మరాజు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి సమూన్

కార్మిక సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

ఉయ్యూరు: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఉయ్యూరు భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకుడు అడపాక రాంబాబు డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 24వ తేదీన కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ఆందోళనను విజయవంతం చేయాలని కోరుతూ ఉయ్యూరు పట్టణంలో శనివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించి కార్మిక కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలని కోరారు. సీపీఎం ఉయ్యూరు పట్టణ కార్యదర్శి బీ రాజేష్ మాట్లాడుతూ ఆందోళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. పలువురు భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.



భవన నిర్మాణ కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న సంఘ ప్రతినిధులు

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

హనుమాన్‌జంక్షన్ రూరల్: అగ్నిప్రమాదాల నియంత్రణ, నివారణ చర్యలపై ఫ్యాక్టరీల్లో పని చేసే కార్మికులు అవగాహన కలిగి ఉండాలని హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం అధికారి జీఆర్ మోహనరావు పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలను పురస్కరించుకుని బాపులపాడు మండలం మల్లవల్లిలోని ఏపీఐఐసీ పారిశ్రామికవాడలో అశోక్ లేలాండ్, ఇతర ఫ్యాక్టరీల్లో పనిచేస్తున్న కార్మికులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఫ్యాక్టరీల్లో అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను అక్కడ పని చేస్తున్న కార్మికులకు వివరించారు. అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు ఆస్తి, ప్రాణ నష్టం వాటిల్లకుండా తీసుకోవాల్సిన నియంత్రణ చర్యలను, మంటలను అదుపు చేసే పద్ధతులను ప్రత్యక్షంగా ప్రదర్శనల ద్వారా వివరించారు.



అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారులు

ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలి

రామవరప్పాడు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడరూరల్ మండలం నిడమానూరులో శనివారం స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మానవహారంగా ఏర్పడి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుదాం– రోగాలను తరిమి కొడదామంటూ నినాదాలు చేశారు. అనంతరం పంచాయతీ కార్యాలయం వద్ద ఈ–వేస్ట్ కలెక్షన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కంప్యూటర్ విడిభాగాలు, ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి జీ జ్యోతి, తహసీల్దార్ సుగుణ, ఎంపీడీవో మురళీకృష్ణ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి నరసింహరావు తదిదరులు పాల్గొన్నారు.

ఉయ్యూరు: ప్లాస్టిక్ రహిత ఉయ్యూరుగా మారుద్దామని మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ(నాని) పిలుపునిచ్చారు. ఉయ్యూరులో శనివారం ఈ–వేస్ట్ మేనేజ్మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పనికిరాని ఎలక్ట్రానిక్ పరికరాలను సేకరించి వ్యర్థాలతో కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, పలువురు కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్రా కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరించారు. కార్యక్రమంలో నున్న గ్రామ సర్పంచి కాటూరి సరళ, పంచాయతీ కార్యదర్శి డీ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పాతపాడు, అంబాపురం గ్రామ పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పీ కోటిలింగమ్మ, డీ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనమలూరులో..

పెనమలూరు: స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని శనివారం కానూరులో నిర్వహించారు. కానూరులోని ప్రధాన రహదారిలో తాడిగడప మున్సిపాలటీ కమిషనర్ పీ భవానిప్రసాద్ సిబ్బందితో కలిసి రహదారులు పరిశుభ్రం చేశారు. ప్రజలు వ్యర్థాలు, చెత్త డ్రెయినేజీలు, బహిరంగ ప్రదేశాల్లో వేయకూడదని ఆయన సూచించారు. అసిస్టెంట్ కమిషనర్ కిరణ్, పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే పెనమలూరు గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ బండి ప్రణవి ఆధ్వర్యాన జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచి లింగాల భాస్కరరావు, ఈవోపీఆర్డీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



నిడమానూరులో మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పిస్తున్న అధికారులు, సిబ్బంది

ఈ–వ్యర్థాలతో అప్రమత్తంగా ఉండాలి

గన్నవరం: ఉంగుటూరు మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో శనివారం స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ఈ–వేస్ట్ డిస్పోజల్ వీక్ నిర్వహించినట్లు ఈఓపీఆర్డీ వీ దిలీప్‌కుమార్ తెలిపారు. పర్యావరణానికి హానికరమైన ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించేందుకు ప్రతి గ్రామ పంచాయతీల్లో కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎంపీపీ వడ్లమూడి సరోజిని, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంతి, పలువురు పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నున్నలో ఎలక్ట్రానిక్ వ్యర్థాలు సేకరిస్తున్న సర్పంచి సరళ



కానూరులో రోడ్డు ఊడుస్తున్న కమిషనర్ భవానిప్రసాద్

పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ



కంకిపాడులో వీధులను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్



కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఆర్డీఓ హెలా షారోన్, సిబ్బంది

కంకిపాడు: స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌ను కంకిపాడు పట్టణంలో శనివారం నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి ప్రధాన సెంటరు వరకూ ర్యాలీ చేపట్టారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పాల్గొని వీధులను శుభ్రం చేసి పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకత తెలియజేశారు. సర్పంచ్ బాకీ రమణ, ఉపసర్పంచ్ రాచూరి చిరంజీవి, ఎంపీడీఓ పి.అనూష, తహసీల్దార్ వీ భావనారాయణ, ఈఓ సాంబశివరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు. అలాగే కంకిపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆర్డీఓ హెలా షారోన్ పాల్గొన్నారు. పరిసరాల పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ వీ భావనారాయణ, డెప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ ఉస్మాన్, సిబ్బంది పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ పి.అనూష, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

గీతామందిరంలో కుంభాభిషేకం ప్రారంభం



ప్రసంగిస్తున్న శ్రీపరిపూర్ణానందగిరిస్వామి

విజయవాడరూరల్: నున్న గ్రామంలోని గీతామందిరంలో మహా సంప్రోక్షణ కుంభాభిషేకం కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో శనివారం ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమాలను వైఖానస ఆగమనుసారం త్రయాహ్నిక దీక్షతో మహా సంప్రోక్షణ పూర్వక కుంభాభిషేకంతో ప్రారంభించారు. యేర్పేడు పీఠం ఉత్తరాధికారి అసంగానందగిరిస్వామి పర్యవేక్షణలో అర్చకస్వామి రొంపిచర్ల దత్తకుమార్ ఆధ్వర్యాన వైదిక పండితులు గోపూజ, విష్వక్సేన, పుణ్యాహవాచన, పంచగవ్యప్రాసన, రుత్విక వరణం, అకల్మష హోమం, వాస్తు పూర్ణాహుతితో కుంభాభిషేకం చేశారు. గీతా మందిరంలో శ్రీకృష్ణ పరమాత్ముని విగ్రహం ప్రతిష్ఠించి పుష్కర కాలం పూర్తయినందున ఈ మహా సంప్రోక్షణ కుంభాభిషేకం నిర్వహణకు గీతమందిర భక్త బృందం శ్రీకారం చుట్టింది. శ్రీమహర్షి సద్గురు మలయాళస్వామి వారి దివ్యాశీసులతో యేర్పేడు వ్యాసాశ్రమ పీఠాధిపతి శ్రీ పూర్ణానందగిరిస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నున్నలో విద్యార్థుల నమోదు



నున్న(విజయవాడరూరల్): ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం నున్న గ్రామంలో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులు కార్పొరేట్ విద్యాసంస్థల తరహాలో విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా నున్న జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉన్న సౌకర్యాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, పాఠశాల విద్యార్థులు విద్య, క్రీడల్లో సాధిస్తున్న విజయాలను విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి పిల్లలను హైస్కూల్లో చేర్పించాలని ప్రధానోపాధ్యాయుడు వీ భూపాల్‌రెడ్డి, ఇతర ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.